క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



కొమ్మూరు(కాకుమాను): గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు తనవంతు కృషి చేస్తానని కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. కొమ్మూరులో మంగళవారం రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జెడ్పీ నిధులతో ఇప్పటి వరకు గ్రామంలో రెండు సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో జెడ్పీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గేరా జ్యోతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేసిన ఎంఈఓ



చినలింగాయపాలెం(కాకుమాను): మన బడి, నాడు–నేడు అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. చినలింగాయపాలెం ప్రాథమిక(స్పెషల్)పాఠశాలలో అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, సకాలంలో పనులు పూర్తయ్యేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి, వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

వేతనాలు పెంచాలని ఏపీఎంకు వినతి



పెదకాకాని: డ్వాక్రా యానిమేటర్లు(వీఓఏ) వేతనాలు పెంచాలని పెదకాకాని ఏపీఎం రాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు తెలియజేశారు. ఏళ్ల తరబడిన పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వేతనాలు బ్యాంకు ఖాతాలకు వేయాలని, అర్హులైన వారికి సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాకాని పద్మ, వి.వెంకటలక్ష్మి, వి.విజయలక్ష్మి, రాజశ్రీ, అరుణ, పద్మినీ ఉన్నారు.

యువకుడి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: యువకుడు కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లాకు చెందిన గోపు వెంకటరెడ్డి కుమారుడు రవికుమార్‌రెడ్డి చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ, బ్రాడీపేటలోని ఓహాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 21వ తేదీ రవికుమార్‌రెడ్డి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమీప బంధువుకు మెసేజ్ పెట్టి, సెల్ స్విచ్ ఆఫ్ చేసి హాస్టల్ నుంచి ఎటో వెళ్లిపోయాడు. కుమారుడి ఆచూకీ కోసం వెతికిన వెంకటేశ్వరరెడ్డి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332కు సమాచారం అందించాలన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

డీఎల్‌పీఓ స్వరూపరాణి

కొల్లిపర: గ్రామాలల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రతేక దృష్టి పెట్టాలని డీఎల్‌పీఓ స్వరూపరాణి అన్నారు.మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామాలల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పారిశుద్ధ్యంపై సూచనలు, సలహాలు అందజేశారు. పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్డీ పూర్ణశంకరరావు, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐ బదిలీ

తెనాలిరూరల్: తెనాలి ట్రాఫిక్ ఎస్ఐ జె.శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఆయనన్ను జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు మంళవారం ఆదేశాలు జారీ చేయడంతో ఇక్కడ రిలీవ్ అయ్యారు. మరో ఎస్ఐ బి.శివరామయ్య ట్రాఫిక్ ఎస్ఐగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. శ్రీనివాస్ బదిలీ కావడంతో శివరామయ్య ట్రాఫిక్ ఎస్ఐగా పూర్తి బాధ్యతలు చేపట్టారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

- తప్పుల్లేని ఓటరు జాబితా ప్రచురణకు సహకరించండి
- రాజకీయ పార్టీల సమావేశంలో ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి

ప్రత్తిపాడు: ఓటరు జాబితాలో జరగనున్న సవరణలకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలున్నా స్థానిక బీఎల్వో, తహసీల్దార్‌ను సంప్రదించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, గుంటూరు ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాపై జరుగున్న ఇంటింటి సర్వే ఈ నెల 21తో ముగియాల్సి ఉందని, కానీ ఎన్నికల కమిషన్ మరో మూడు రోజుల పాటు సర్వే ప్రక్రియను పొడిగించిందన్నారు. మూడు రోజుల్లో నూటికి నూరుశాతం సర్వే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఓట్ల తొలగింపు, మార్పులకు సంబంధించి కొన్ని అర్జీలు వచ్చాయన్నారు. తొలగింపునకు సంబంధించి వచ్చిన అర్జీలను పార్టీల నేతలకు అందిస్తామని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఏమైనా అభ్యంతరాలుంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరిస్తేనే పారదర్శకమైన, తప్పులు లేని ఓటరు జాబితా ప్రచురించవచ్చని ఆర్డీవో చెప్పారు. పలువురు నాయకులు లేవనెత్తిన అంశాలకు ఆర్డీవో ప్రభాకరరెడ్డి సానుకూలంగా స్పందించి, పరిష్కారాన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'ఐఓటీ'తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ రామక్రిష్ణ

చేబ్రోలు: ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్)లో పట్టు సాధించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పర్పుల్ టెక్నాలజీస్ సీనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ రామక్రిష్ణ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్డినో అండ్ ఐఓటీ పై రెండు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. సీనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ రామక్రిష్ణ మాట్లాడుతూ స్మార్ట్ హోం ఆటోమేషన్, ఆరోగ్య సేవలు, ఇండస్ట్రియల్ ఐఓటీ, అగ్రికల్చర్, స్మార్ట్ సిటీస్ వంటి రంగాలకు ఈ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ రంగంలో ఈ టెక్నాలజీ ద్వారా రైతులు ఇంటి నుంచే నీటి మోటార్లను కంట్రోల్ చేయవచ్చని తెలిపారు. ఐఓటీ సాయంతో ఆరోగ్య రంగంలో సామాన్య ప్రజల ఆరోగ్య పర్యవేక్షణ, రక్తపోటు, హార్ట్ రేటును మానిటరింగ్ చేయవచ్చని వివరించారు. ఉజ్వల భవిష్యత్తు కోసం ఒకరికొకరు ప్రోత్సాహం ఇచ్చిపుచ్చుకోవడం ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని చెప్పారు. ప్రిన్సిపల్ కె.ఫణీంద్ర కుమార్ పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్

పెదకాకాని: గ్రామ వలంటీర్ నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని నంబూరు ఎస్టీ–1, బీసీ– 2, ఓసీ–1, ఉప్పలపాడు ఎస్సీ–1, వెనిగండ్ల బీసీ–1, ఓసీ–1, పెదకాకాని బీసీ–1, ఓసీ–1 మొత్తం తొమ్మిది గ్రామ వలంటీర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 23న దరఖాస్తులు స్వీకరణ, 24న ఆన్‌లైన్ దరఖాస్తు, 28న దరఖాస్తుల పరిశీలన, 29న మౌఖిక పరీక్ష, 31న ఎంపికైన అభ్యర్థుల వివరాలు వెల్లడించడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు. సొంత గ్రామస్తులు.. 18 నుంచి 35ఏళ్ల వయస్సు, పదవ తరగతి పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్



చేబ్రోలు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను ఎస్ఈబీ పొన్నూరు సీఐ సుకన్య మంగళవారం అరెస్ట్ చేశారు. బ్రాహ్మణ కోడూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో ఎస్ఈబీ అధికారులు దాడులు చేశారు. మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకొని, ఆమె నుంచి 37 మద్యం క్వార్టర్ బ్యాటిల్స్ స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐ గీతిక, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు

- తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు వినియోగించుకోవాలి
- డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: మాతృ మరణాలను అరికట్టడంలో భాగంగా గర్భిణులు తప్పనిసరిగా తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) వాహనం సేవలను వినియోగించుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు కోరారు. ప్రసవ తేదీకి ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి నాణ్యమైన, నిపుణులైన వైద్య ఆరోగ్య సేవలు వినియోగించుకోవాలన్నారు. ప్రసవ సమయానికి ముందుగా వారు కోరుకున్న ఆసుపత్రుల్లో చేరి తల్లికి ఏ విధమైన ప్రమాదకరమైన పరిస్థితులు రాకుండా ఉండేందుకు తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. గర్భిణులకు ప్రభుత్వం ఉచితంగా టిఫా స్కాన్, రెండు సాధారణ స్కానింగ్‌లు చేయించుకునే అవకాశం కల్పించిందన్నారు. గర్భిణులు గర్భంలో ఉండే బిడ్డ ఆరోగ్య పరిస్థితి ముందస్తుగా తెలుసుకునేందుకు ఉపయోగపడే అధునాతనమైన టిఫా స్కాన్‌ని ఉచితంగా అందిస్తున్న నేపథ్యంలో వినియోగించుకోవాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ప్రసవ సేవలు, సౌకర్యాలు పొందడంతోపాటు ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలింతలకు రక్తహీనత వలన వచ్చే అనారోగ్య సమస్యలకు రాకుండా ఎఫ్‌సీఎం ఇంజక్షన్‌ను ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నట్లు వెల్లడించారు. మాతృమరణాలు గణనీయంగా తగ్గించేందుకు ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న సౌకర్యాలను గర్భిణులు వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా జానపద కళా ఉత్సవాలు



ఉత్సవంలో పాటలు పాడుతున్న కళాకారులు

తెనాలి: అంతర్జాతీయ జానపద కళాదినోత్సవం సందర్భంగా మంగళవారం అభ్యుదయ కళాసమితి, బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జానపద కళా ఉత్సవాలను నిర్వహించారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఒకప్పటి ప్రజల అలవాట్లు, ఆచారాలే జానపద సంస్కృతిగా వక్తలు చెప్పారు. ఆ క్రమంలోనే జానపద కళలు అభివృద్ధి చెందాయని తెలిపారు. జానపద కళలను ఆదరించి, వాటిని కనుమరుగు కాకుండా చూడాలని అన్నారు. రచయిత ప్రొఫెసర్ బి.లలితానందప్రసాద్, ప్రముఖ హరికథా భాగవతార్ బెజ్జంకి నాగమణి, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, వాల్మీకి విజయలక్ష్మి, విజయదుర్గ, శారదా చలపతి, పార్వతి, బెల్లంకొండ వెంకట్, టీజీఎం రావు, ఎంవీ రఘునాధరావు, అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి నీలాంబ్రం, గాయని కళ్యాణి, పెద్దిరాజు, తులసి పాల్గొన్నారు. పలు జానపద కళలను కళాకారులు ప్రదర్శించారు. శ్రీదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

వ్యవసాయాన్ని కార్పొరేట్‌కు కట్టబెడుతున్న కేంద్రం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

తెనాలి: కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలకు పాల్పడుతోందని సీపీఎం సీనియర్ నేత ములకా శివసాంబిరెడ్డి ఆరోపించారు. దేశంలో జరుగుతున్న మైనారిటీలపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు, చర్చిల విధ్వంసం వంటి చర్యలను లౌకికవాదులు ఖండించాలని కోరారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఈనెల 25న గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞానమందిరంలో జరిగే సభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు పెద్ద ఎత్తున జనం తరలిరావాలని కోరుతూ మంగళవారం ఆయన రూరల్ మండల గ్రామాలైన కఠెవరం, ఎరుకలపూడిలో కరపత్రాలను పంపిణీ చేశారు. కంచర్ల తారకేశ్వరరావు, షేక్ మస్తాన్, షేక్ అబ్దుల్ గఫూర్, షేక్ ఖాదర్, పీకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన అవసరం

- ఆత్మ పీడీ రామాంజనేయులు
- వరి సమగ్ర యాజమాన్యంపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు

తెనాలిటౌన్: వరిపైరులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రామాంజనేయులు రైతులకు సూచించారు. రూరల్ మండలం కొలకలూరులోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు వరి సమగ్ర పంట యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ అధ్యక్షత వహించారు. ఆత్మ పీడీ రామాంజనేయులు మాట్లాడుతూ వరిలో కలుపు యాజమాన్యం, సమగ్ర పోషక యాజమాన్యం గురించి వివరించారు. పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వరిలో పైపాటుగా డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను వాడరాదని సూచించారు. మొదటి దఫా ఎరువుతో పాటు ఎకరానికి 25 కిలోల పొటాష్ ఎరువులను తప్పని సరిగా వాడాలన్నారు. జీవన ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త జి.నగేష్, జిల్లా రైతు శిక్షణ కేంద్రం అధికారి ఎం.రాజవంశీలు మాట్లాడారు. ఏఈఓ మోహన్, వీఏఏ నాగరాజు రైతులు పాల్గొన్నారు. తొలుత శాస్త్రవేత్తలు, అధికారులు వెద పద్ధతిలో సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు.

అసైన్డ్ భూముల నివేదిక సిద్ధం చేయాలి

జాయింట్ కలెక్టర్ ఎస్.రాజకుమారి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

పెదకాకాని: అసైన్డ్ భూములకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రాజకుమారి ఆదేశించారు. మండంలోని నంబూరు గ్రామ సచివాలయంలో మంగళవారం వీఆర్వోలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ మాట్లాడుతూ.. పీఎం కిసాన్ పథకం నగదు రైతుల ఖాతాలకు జమ కావడం లేదని, అందుకు గల కారణాలు చెప్పాలని వీఏఏలను కోరారు. కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంలో జాప్యంపై వివరణ కోరారు. మండలంలో జరుగుతున్న భూముల రీ–సర్వేలో తప్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. ఎసైన్‌మెంట్ భూములకు సంబంధించిన వివరాలు, ప్రస్తుతం ఆ భూముల్లో సాగుచేస్తున్న వారు ప్రారంభం నుంచి ఉన్నారా, వారుసులు సాగు చేస్తున్నారా, ఆక్రమించుకుని లీజుకు ఇస్తున్నారా అన్న వివరాలు సేకరించాలని ఆదేశించారు. అలానే అసైన్డు భూములలో నివాసాలపై పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలని జేసీ చెప్పారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల ద్వారా అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఆన్‌లైన్ విధానాన్ని మెరుగు పరచుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పి.రత్నం, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, వీఆర్వోలు, వీఏఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవాలయంలో చక్రస్థాపన మహోత్సవాలు



విద్యుద్దీప వెలుగుల్లో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయం

నేటి నుంచి 25 వరకు విశేష పూజలు



ఆలయంలో కొలువుదీరిన వీరభద్రస్వామి

యనమదల (ప్రత్తిపాడు): యనమదలలో కొలువుదీరిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం చక్రస్థాపన మహోత్సవాలకు ముస్తాబయ్యింది. గ్రామంలో కొలువుదీరిన వీరభద్రుని దేవాలయంలో ఈ నెల 23 నుంచి శ్రీ చక్రస్థాపన మహోత్సవాలు జరగనున్నట్లు ఆలయ అర్చకులు వాసు శర్మ తెలిపారు. బుధవారం ఉదయం గోపూజ, విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సాయంత్రం కంకణధారణ, 108 అఖండాలతో శ్రీ చక్ర సహిత గ్రామోత్సవం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, జలాధివాసం, క్షీరాధివాసం నిర్వహించనున్నారు. గురువార అంకురారోపణ, వాస్తుహోమం, హోమ క్రతువులు, శ్రీచక్ర స్వరూపిణి అయిన అమ్మవారికి విశేష పూజలు జరపనున్నారు. అనంతరం రుద్రహోమం, నవగ్రహోమం, దాన్యాధివాసం జరగనున్నాయని చెప్పారు. 25న సామూహిక కుంకుమార్చన, వీరభద్రునికి పల్లెర మహోత్సవాన్ని నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం జరగనుందని వాసుశర్మ వివరించారు. సాయంత్రం చండీ హోమం, శ్రీచక్రస్థాపన జరుగుతుంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్‌దీప కాంతులతో దేవస్థానం అలరారుతోంది.

రైల్వే గేట్ల సమస్యలు పరిష్కరించాలి



లక్ష్మీపురం: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో భారీ ట్రాఫిక్ ఇక్కట్లు నెలకొంటున్న రైల్వే గేట్ల సమస్యలపై వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం మహిళా నాయకురాలు నూరి ఫాతిమా మంగళవారం నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు శ్రీ కృష్ణ దేవరాయలును, గుంటూరు రైల్వే డీఆర్ఎం రామకృష్ణలను కలసి చర్చించారు. నెహ్రూనగర్ ఆర్‌యూబీ, సంజీవయ్య నగర్, రెడ్డిపాలెంకు సంబంధించి ఆర్‌ఓబీల అభివృద్ధి పనులపై వినతి పత్రం అందజేశారు. ఈ విషయం పై స్పందించిన రైల్వే డీఆర్ఎం సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. నియోజకవర్గం కార్పొరేటర్లు రామనబోయిన అజయ్, మార్కెట్ శ్రీను, పాపతోటి అంబేడ్కర్, యాట్ల రవి, డి.వంశీ, అగ్గిపెట్టి రాజు, పాల్గొన్నారు.

నిబంధనల మేరకే నిర్మాణాలు

- ఉల్లంఘిస్తే తగు చర్యలు
- నగర కమిషనర్ చేకూరి కీర్తి



అపార్ట్‌మెంట్ కొలతలను దగ్గరుండి పరిశీలిస్తున్న కమిషనర్ చేకూరి కీర్తి

నెహ్రూనగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు ర్యాంప్‌లు రోడ్ మీదకు రాకుండా, సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణాలు చేయకుండా నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కోదండ రామయ్య నగర్, ఉద్యోగనగర్, ఎస్‌వీఎన్ కాలనీ, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి పట్టణ ప్రణాళిక అధికారులకు తదుపరి అనుమతులపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డీపీఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందన్నారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. ర్యాంప్‌లు రోడ్డు మీదకు రాకుండా చూడాలని, అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరీకి కేటాయింపు ఉండాలన్నారు. రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్‌లు నామమాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కనెక్షన్ చేయాలన్నారు. ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని ఆదేశించారు. ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు, ప్రణాళిక విభాగానికి సంబంధించిన నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు అశోక్ కుమార్, అజయ్ కుమార్, టీపీఎస్ హృదయరాజు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిండ మార్పిడి పద్ధతితో మేలు జాతి పశువుల ఉత్పత్తి

తాడికొండ: పిండ మార్పిడి పద్ధతిలో సంతానోత్పత్తి చేపట్టడం ద్వారా మేలు జాతి పశువులను ఉత్పత్తి చేయవచ్చని లాం ఫాం శాస్త్రవేత్తల బృందం తెలిపింది. తాడికొండ మండలం రావెల గ్రామంలో పిండ మార్పిడి పద్ధతి ద్వారా గేదెల్లో సంతానోత్పత్తి చేసేందుకు అద్దె గర్భం ద్వారా ప్రవేశపెట్టి విజయవంతంగా ఉత్పత్తి చేసిన దూడను మంగళవారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఈ పద్ధతిలో అద్దె గర్భం ద్వారా ప్రవేశపెట్టిన వీర్య ద్వారా పుట్టిన దూడ ఆరోగ్యంగా ఉందని వారు తెలిపారు. రైతు షేక్ సైదా, ముప్వా శేషగిరిరావుకు చెందిన గేదెల్లో లింగనిర్ధార వీర్యం ద్వారా అభివృద్ధి చేసిన దూడను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈనెల 10 – 13వ తేదీన ముర్రా జాతి దూడలు జన్మించాయని తెలిపారు. ఇప్పటి వరకు లింగమార్పిడి పద్ధతి ద్వారా సంతానోత్పత్తి కేవలం ఆవుల్లో మాత్రమే జరిగేదని, తొలిసారి ఏపీలో ప్రవేశపెట్టి విజయవంతం చేసినట్లు ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీమన్నారాయణరావు, ఈఓ డాక్టర్ బాలశంకరరావు తెలిపారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాకులు డాక్టర్ పి.శ్రీనివాసరావు, ఏపీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ రవితేజ పాల్గొన్నారు.